


ఎమ్మెల్సీ యాదవరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

# సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ టాప్

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**

గజ్వేల్, నవంబర్ 4 : దేశంలోనే ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ టాప్‌లో నిలిచిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శివన్నగారి మల్లప్ప, ఆదర్శ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు కాసాని శ్యామ్‌కుమార్, కాంగ్రెస్ యూత్ సభ్యులు మెతుకు సతీశ్, నవీన్ సర్పంచ్ బాలచంద్రం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో మోడల్‌గా నిలిచిందని, ఇతర రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడ అభివృద్ధిని చూసేందుకు వస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలచంద్రం, ఎంపీటీసీ ఆంజనేయులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు రామగౌడ్, కాసాని వినయ్, మంద రాజు, మాదగారి చంద్రం పాల్గొన్నారు.

# పేదింటి పెద్దకొడుకు సీఎం కేసీఆర్



చిన్నకిష్టాపూర్‌లో కారు గుర్తుకు ఓటు వేయాలని వృద్ధులను అభ్యర్థిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, దేవీరవీందర్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 4 : పేదింటి పెద్దకొడుకు సీఎం కేసీఆర్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమైక్య పాలనలో వెనకబడిన తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చి దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ గజ్వేల్ నియోజవకర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. రైతు సంక్షేమ ధ్యేయంగా 24 గంటల కరెంట్, గోదావరి జలాలు అందించి రైతుల గోసను తీర్చిన సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోలా సద్గుణారవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, సర్పంచ్ కర్రోల్ల కనకయ్య, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాసాని చేరికతో మరింత పుంజుకున్న బీఆర్ఎస్

గజ్వేల్ అర్బన్, నవంబర్ 4 : కాసాని జ్ఞానేశ్వర్ చేరికతో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరిందని, ముదిరాజ్‌లంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని ఆ సంఘం మండలాధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ కొంటెమైన నర్సింహులు అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో ముదిరాజ్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ నిరుద్యోగులు మాత్రమే బీఆర్ఎస్‌ను వదిలివెళ్తున్నారని, నిజమైన కార్యకర్తలే బీఆర్ఎస్ బలగం అన్నారు. ఈటల రాజేందర్ కుటుంబంలో ఆయన తప్ప అందరూ రెడ్డివర్గమేనని, బీసీనంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బీసీలను దగ్గరికి రానివ్వని ఈటల.. ఇప్పుడు ఓట్ల కోసం పాట్లుపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈటలను ఎవరూ నమ్మేస్థితిలో లేరన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ లాంటి వారే సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజాసేవకు కలిసి వస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్‌ను లక్షకుపైగా మెజార్టీతో గెలిపించి మరోసారి సీఎంను చేస్తామన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్న ముదిరాజ్ మండలాధ్యక్షుడు నర్సింహులు నాయకులు

# కేసీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం

- ముున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి
- పట్టణంలోని 3,7,14వ వార్డుల్లో వార్డు కమిటీ సమావేశాలు



14 వార్డులో జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

గజ్వేల్ అర్బన్, నవంబర్ 4 : గజ్వేల్ నుంచి కేసీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని, అభివృద్ధి పనులే పార్టీని గెలిపిస్తాయని గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని 3,7, 14 వార్డు కమిటీలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, మ్యానిఫెస్టోలోని కొత్త పథకాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. యువకుల నుంచి వృద్ధుల వరకు సీఎం కేసీఆర్ అందించిన పథకాల ద్వారా ఆయా కుటుంబాలు లబ్ధి పొందిన విషయాలను వివరించాలని సూచించారు. గతంలో మంత్రి గీతారెడ్డి ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా అభివృద్ధి చేసిందేమీలేదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రహదారులు, భవనాలు, గ్రామాల్లో మౌళిక వసతులు, ఎడ్యుకేషన్ హబ్‌లు, గురుకుల పాఠశాలలు, సమీకృత మార్కెట్, కార్యాలయాలు ఇలా వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచి భారీ మెజార్టీతో గెలిస్తే మరిన్ని నిధులు ఈ ప్రాంతానికి వస్తాయని చెప్పారు. గజ్వేల్ నుంచి కేసీఆర్ గెలుపు ఎప్పుడో ఖాయమైందని, కేవలం భారీ మెజార్టీ కోసమే పనిచేయాల్సి ఉందన్నారు.

**నీటి కష్టాలు తీర్చింది సీఎం కేసీఆరే..**

గజ్వేల్‌లో ఆడపడుచులు చెరువు దగ్గరున్న మొద్దుబాయి, బోరుబావికి మంచినీళ్ల కోసం వచ్చేవారని, ఆడవారు భుజాన, మగవారు సైకిళ్లపై నీళ్ల బిందెలతో కిలో మీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకునేవారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి గుర్తు చేశారు. సమైక్య రాష్ట్రంలో నల్లా నీళ్ల కోసం రాత్రి 12 గంటలకు కాపలా కాయాల్సి వచ్చేదన్నారు. సీఎం కేసీఆర్ మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తీర్చారని చెప్పారు. అనంతరం వార్డుల్లో కౌన్సిలర్లు అల్వాల బాలేశ్, కూరాకుల శ్రీనివాస్, మర్కంటి వరలక్ష్మీ కనకయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, ప్రధాన కార్యదర్శి సురేశ్, కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు జాఫర్‌ఖాన్, నర్సింగరావు, ఆర్కే శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, చింత శ్రీనివాస్, కాముని మురళి, ఎల్లేశం, జయ్, ఆకుల దేవేందర్, భూపాల్‌రెడ్డి, షరీఫ్, ఉమర్, స్వామి పాల్గొన్నారు.



7వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి




3వ వార్డులో మాట్లాడుతున్న పాతూరి సుధాకర్‌రెడ్డి

# కేసీఆర్ హ్యాట్రిక్ విజయం పక్కా

జగదేవ్‌పూర్, నవంబర్ 4 : కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా విజయం సాధించడం పక్కా అని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రం జగదేవ్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో ప్రజలు పడ్డ బాధలు కోకొల్లలు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి ఒక్కో సమస్యను అధిగమించారన్నారు. ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీరు, అందమైన రోడ్లు, పచ్చటి హరిత హారం మొక్కలు, గ్రామగ్రామాన పల్లెప్రకృతి వనాలు, మురుగు కాల్వల నిర్మాణం, కొత్త జీపీ భవనాలు, మహిళా భవనాలు ఇలా అన్ని సమకూర్చి గ్రామాలకు వన్నె తెచ్చారని తెలిపారు. రైతులకు అండగా నిలచేలా రైతుబంధు, రైతు బీమా, పంట పెట్టుబడి సాయం అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. కార్యక్రమం లో ఆత్మకమిటీ చైర్మన్ రంగారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, కొండపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీ కావ్యాదుర్గయ్య, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మునిగడప ఎంపీటీసీ కిరణ్, సర్పంచులు యాదవరెడ్డి, సంతోష్‌రెడ్డి, రాజు, చంద్రశేఖర్, సత్యం, కరుణాకర్, బాలరాజు, బషీర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బజ్జీలు వేసిన బీఆర్ఎస్ నాయకులు..**

జగదేవ్‌పూర్‌లో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు స్థానికంగా ఓ మిర్చి బండి దగ్గరకు వెళ్లి వ్యాపారం ఎలా ఉంది.. ఆదాయం ఎంత వస్తుంది..? అని ఆప్యాయంగా పలుకరిస్తూ మిర్చీలు వేసి కేసీఆర్‌కు ఓటేయాలని కోరారు. కేసీఆర్‌తోనే చిరు వ్యాపారులకు లాభం చేకూరుతుందని, కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్ కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

# ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

ములుగు, నవంబర్ 4 : ప్రతిపక్ష నాయకులు చెప్పే భూటకపు మాటలను ప్రజలు నమ్మొద్దని డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా సూచించారు. శనివారం మండల పరిధిలోని అచ్చాయపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లో ఎంపీపీ లావణ్యాఅంజన్‌గౌడ్, జడ్పీటీసీ జయమ్మాఅర్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి కారుగు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌కు భారీ మెజార్టీ కట్టబెట్టాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీ అందించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని సూచించారు. సమైక్య పాలనలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని తెలంగాణ.. నేడు కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాబు గౌడ్, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు గణేశ్‌గుప్తా, లింగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ నర్సింహారెడ్డి, సర్పంచ్ రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.